ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
గురువారం 7 నవంబరు 2024

న్యూస్ బాక్స్

క్రీడలతో విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి

సుల్తానాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీల ద్వారా క్రీడాకారులకు నైపుణ్యాభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని సెయింట్ మేరీస్ స్కూల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ఎస్‌జీఎఫ్ అండర్- 17 బాలబాలికల ఖోఖో పోటీలను ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, క్రీడా నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు, చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, పన్నాల రాములు ముస్తాల రవీందర్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, దాసరి రమేష్, సురేందర్‌తోపాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

108లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

పెద్దపల్లి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 108లో ఉద్యోగాలు చేసేందుకు బుధవారం పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించగా 70 మంది హాజరైనట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా మేనేజర్ సలీం తెలిపారు. ఈ సందర్భంగా వచ్చిన అభ్యర్థులకు రాతపరీక్ష నిర్వహించి, వారినుంచి స్టడీ సర్టిఫికెట్స్‌ను తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రోగ్రాం మేనేజర్‌కు మారస్వామి, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

సుల్తానాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న ఆధునిక వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ సూచించారు. బుధవారం ఆస్పత్రిని సందర్శించి అందులో జరుగుతున్న డెలివరీ కేసులను పరిశీలించారు. అందుబాటులో ఉన్న నిపుణులైన డాక్టర్ల గురించి వారిందించే సేవల గురించి వివరించారు.

ఓర్వలేకనే ఆరోపణలు..

కళ్యాణ్‌నగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజకవర్గం, మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ పార్టీ బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని, కాంగ్రెస్ నాయకులు దీటి బాలరాజు, తిప్పారపు శ్రీనివాస్, కాల్వలింగస్వామి ఒక ప్రకటనలో హెచ్చరించారు.

9 నుంచి సమగ్ర సర్వే..

- ఇంకా పూర్తికాని కుటుంబాల గుర్తింపు సర్వే
- కొనసాగుతున్న ప్రక్రియ, పరిశీలించిన కలెక్టర్
- తుది సర్వే ఫారాన్ని విడుదల చేయని ప్రభుత్వం



తన క్యాంపు కార్యాలయానికి సిబ్బంది స్టిక్కర్ అంటించడాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నుంచి చేపట్టాల్సిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం మరో రెండు రోజులు ఆగాల్సిందే. సర్వేకు సంబంధించిన 75 ప్రశ్నలతో కూడిన ఫార్మాట్ ఇప్పటికే ప్రభుత్వం విడుదల చేసినప్పటికీ, అందులో కొన్ని చేర్పులు, మార్పులు చేయాలని భావించిన ప్రభుత్వం తుది ఫార్మాట్‌ను ఇంకా విడుదల చేయలేదు. దీంతో సర్వే ఈనెల 9వ తేదీ నుంచి చేపట్టనున్నారు. అలాగే పట్టణాలు, గ్రామాల్లో కుటుంబాల గుర్తింపు సర్వే ఇంకా పూర్తికాలేదు. జిల్లాలో ఒక్క రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో మినహా మిగతా ప్రాంతాల్లో ఇళ్ల గుర్తింపు పూర్తయ్యింది. కుటుంబాల గుర్తింపు కోసం ప్రభుత్వం మరో మూడు రోజులు గడువు ఇచ్చింది. 6,7,8 తేదీల్లో గ్రామాలు, పట్టణాల్లో మరోసారి కుటుంబాలను గుర్తించాలని, ఎక్కడైనా తప్పిపోయినవి ఉంటే మరోసారి పరిశీలించి గుర్తించాలని ఆదేశించారు. సర్వేలో అన్ని కుటుంబాలు పాల్గొనే విధంగా పకడ్బందీగా సర్వే చేయాలని అధికారులు పేర్కొంటున్నారు. 2011 జనాబా లెక్కల ప్రకారం జిల్లాలో 7,95,332 మంది జనాబా ఉన్నారు. ఇందులో పురుషులు 3,99,325 మంది, మహిళలు 3,96,006 మంది ఉన్నారు. కుటుంబాలు 2,09,677 ఉన్నాయి. మంగళవారం నాటికి 2,47,518 కుటుంబాలను గుర్తించారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 1,57,701 కుటుంబాలను, పట్టణ ప్రాంతాల్లో 89,817 కుటుంబాలను గుర్తించి స్టిక్కర్లను అంటించారు. మిగిలిన కుటుంబాలను గుర్తించేందుకు ఈనెల 8వ తేదీ వరకు సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఆ మేరకు సర్వే బృందాలు పట్టణాలు, గ్రామాల్లో సర్వేకు సంబంధించి కుటుంబాల సంఖ్యను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ప్రక్రియను బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామాన్ని సందర్శించి కుటుంబాల గుర్తింపు కోసం సర్వే సిబ్బంది ఇళ్లకు అంటించిన స్టిక్కర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కుటుంబాల గుర్తింపుపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే కలెక్టర్ నివాసం ఉండే కలెక్టరేట్‌లోని క్యాంపు కార్యాలయానికి సిబ్బంది స్టిక్కర్ అంటించగా దానిని పరిశీలించి సర్వే పకడ్బందీగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

● ఇంకా జారీ కాని సర్వే ఫారాలు..

రాష్ట్రంలోగల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, ఇతర వర్గాలకు చెందిన ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ పరిస్థితులతో పాటు కుల గణన చేసేందుకు తుది సర్వే ఫారాన్ని ప్రభుత్వం ఇంకా విడుదల చేయలేదు. మొదట 7 పేజీల్లో 75 ప్రశ్నలతో కూడిన పార్ట్ 1, పార్ట్ 2 ఫారాలను విడుదల చేసింది. వీటిని జిల్లాల్లోనే కుటుంబాల సంఖ్యను అనుసరించి ప్రింటింగ్ చేయించుకోవాలని ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది. ప్రొఫార్మాలో చేర్పులు, మార్పులు చేస్తారని, తుది ఫార్మాట్ పంపించే వరకు సర్వే చేయవద్దని ఉన్నతాధికారులు ఆదేశించారు. సర్వే ఫారం వస్తే వెంటనే దానిని ముద్రించి సర్వేను ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం గుర్తించినప్పటికీ, సర్వే ఫారం ఇంకా విడుదల కాలేదు. అందులో చేర్పులు, మార్పులు చేస్తారా, 75 ప్రశ్నలతో కూడిన ఫారాన్నే సర్వేకు ఉపయోగించమంటారా తెలియదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఒక్కో ఎన్యూమరేటర్ ప్రతి రోజు 10 కుటుంబాల చొప్పున 15రోజుల్లో 150 కుటుంబాల సర్వే

మిగతా 8వ పేజీలో...

వృద్ధులే లక్ష్యంగా సైబర్ నేరస్థుల మోసాలు : సీపీ శ్రీనివాస్



ప్రసంగిస్తున్న రామగుండం సీపీ శ్రీనివాస్

జ్యోతినగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వృద్ధులను టార్గెట్‌గా చేసుకొని సైబర్ నేరస్థులు మోసాలకు పాల్పడుతున్నారని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఎన్టీపీసీ ఈడీసీ మిలీనియం హాలులో సీనియర్ సిటిజన్లకు సైబర్ క్రైం ఏసీపీ వెంకటరమణ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీ ప్రసంగిస్తూ ఇంటర్నెట్, టెక్నాలజీపై సరైన అవగాహన లేని సీనియర్ సిటిజన్లు, విశ్రాంత ఉద్యోగులను లక్ష్యంగా చేసుకున్న నేరస్థులు మోసాలు చేస్తున్నారన్నారు. విశ్రాంత ఉద్యోగులకు రిటైర్మెంట్ తరువాత పెద్ద మొత్తంలో గ్రాట్యుటీ ఇతరత్రా సొమ్ము వారి ఖాతాల్లో ఉంటాయని, పెద్ద మొత్తంలో పెన్షన్లు రిటైర్ ఉద్యోగులే పొందుతారనే వారిపైనే దృష్టి పెట్టారని పేర్కొన్నారు. తెలియని నెంబర్ల నుంచి వచ్చే కాల్స్ వస్తే సమాచారం ఇవ్వవద్దన్నారు. అన్‌నోన్ వీడియో కాల్స్‌ను ఎత్తవద్దని, అధిక మొత్తం డబ్బు ఇస్తామని చెప్పే మాటలను నమ్మవద్దని కోరారు. ఈ విషయంలో సరైన అవగాహన ఉండాలని, మోసపోతే వెంటనే 1930కు ఫోన్ చేయాలన్నారు. సైబర్ నేరాలకు గురికాకుండా ఉండడానికి అవసరమైన పలు సూచనలు, జాగ్రత్తలను, సాంకేతిక అంశాలను సైబర్ క్రైం ఏసీపీ వెంకట రమణ సీనియర్ సిటిజన్లకు వివరించారు.

ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, సీనియర్ సిటిజన్లు, రిటైర్డ్ ద్యోగులు పాల్గొన్నారు.



చిన్నకలువలలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రైతులను ఆదుకోవడానికే సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

- క్వింటాలుకు మద్దతు ధర రూ.7,521 చెల్లింపు..
- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

8



ఎలిగేడులో వివరాలను అడిగి తెలుసుకుంటున్న వేణు

నాణ్యమైన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలి..

- అదనపు కలెక్టర్ డి.వేణు
- ఎలిగేడు, సుల్తానాబాద్ మండలాల్లోని కొనుగోలు కేంద్రాల పరిశీలన

8

కూల్చివేతలను నిరసిస్తూ బీఆర్ఎస్ ధర్నా

- వినతిపత్రం ఇచ్చి ఆందోళన విరమించిన నాయకులు



కార్పొరేషన్ కార్యాలయంలో ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

కోల్‌సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలకసంస్థ పరిధిలో అక్రమ కట్టడాల పేర కూల్చివేతలను నిరసిస్తూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆందోళన నిర్వహించారు. వినతిపత్రం ఇస్తామంటూ పోలీసులకు చెప్పి కార్యాలయానికి వచ్చిన కార్పొరేటర్లు, నాయకులు కార్యాలయంలో బైఠాయించి ధర్నా నిర్వహించారు. కూల్చివేతలను ఆపాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చందర్ మాట్లాడుతూ రామగుండంలో అరాచక పాలన సాగుతోందని, బీఆర్ఎస్ పార్టీ నాయకులను టార్గెట్‌గా చేస్తూ కూల్చివేతలకు పాల్పడుతున్నారని, కూల్చివేతలను ఆపకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వ్యాపారులకు ఎలాంటి సమాచారం లేకుండానే కూల్చివేతలు చేస్తున్నారని, ఆర్టిస్టుల ఫ్లెక్సీల బోర్డులను తొలగించి వారిని రోడ్డున పడేశారన్నారు. గోదావరిఖనిలో అనధికారిక కట్టడాలే ఎక్కువగా ఉన్నాయని, వాటికి ఫీజులు తీసుకుని క్రమబద్ధీకరించాలి తప్ప కూల్చివేతలు చేయకూడదన్నారు. గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి కార్యాలయంలో ఆందోళన విరమించాల్సిందిగా బీఆర్ఎస్ నాయకులకు సూచించారు పోలీసులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. సీఐ ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది కార్పొరేటర్లు, నాయకులను బలవంతంగా పంపించేందుకు ప్రయత్నించగా మహిళా కార్పొరేటర్లు, నాయకురాళ్లు అడ్డుకున్నారు. దీంతో తోపులాట చోటు చేసుకుంది. కార్యాలయంలోని చెట్ల కుండీలు పగిలిపోయాయి. పోలీసులు బలవంతంగా మాజీ ఎమ్మెల్యే చందర్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, కార్పొరేటర్లు పెంట రాజేష్, భాస్కర్, కృష్ణవేణి, బాదె అంజలి, శివకుమార్, కవిత సరోజి, గాదం విజయ తదితరులను బయటకు పంపారు. అనంతరం కార్యాలయం బయట ఆందోళన నిర్వహించారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్‌కు రాయలింగుకు వినతిపత్రం అందజేసి ఆందోళన విరమింప చేశారు. ఈ నిరసనలో నాయకులు అచ్చె వేణు, నూతి తిరుపతి, మారుతి, బొడ్డుపెల్లి శ్రీనివాస్, తోకల రమేష్, మెతుకు దేవరాజు, సట్టు శ్రీనివాస్, ముద్దసాని సంధ్యారెడ్డి, ఇరుగురాళ్ల శ్రావణ్, చల్లగురుగుల మొగిలి, రామరాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులపై కేసు..

గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని సిరి ఫంక్షన్ హాల్‌లోని నిర్మాణాలను తొలగించినందుకు నిరసనగా బుధవారం బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కార్పొరేషన్ కార్యాలయంలోకి దౌర్జన్యంగా దూసుకెళ్లి ప్రజలకు, అధికారుల విధులకు ఆటంకం కలిగించారని కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతి రాజేష్ వేణు, మరో 30మందిపై కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ ఎస్ఐ కే రమేష్ పేర్కొన్నారు. దీనిపై విచారణ జరుపుతున్నామన్నారు.

ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించొద్దు : సీపీ



కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

కమాన్‌పూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ స్టేషన్‌కు వచ్చి తమకు న్యాయం చేయాలంటూ ఫిర్యాదులు చేస్తున్న వారి విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించొద్దని, వారి ఫిర్యాదుపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని, గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అల్లరిమూకలపై నిఘా పెట్టాలని రామగుండం సీపీ ఎం. శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను, కేసుల పురోగతి, గ్రామాల్లో శాంతిభద్రతల పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలు, వారు చేస్తున్న విధులు, పనితీరు, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏసీపీ రమేష్, గోదావరిఖని-2 సీఐ ప్రసాద్‌రావు, ఎస్ఐ ప్రసాద్ ఉన్నారు.

● ధర్మారం (ఆంధ్రజ్యోతి) : క్రిప్టో కరెన్సీ ఇండియాలో చెల్లుబాటు కాని కరెన్సీ అని, ప్రజలు దాన్ని నమ్మి మోసపోయి తరువాత కేసులు పెడితే ప్రయోజనం ఉండదని సీపీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సీపీ తనిఖీ చేశారు. మండల పరిధిలో క్రైం, లాఅండ్‌ఆర్డర్, గ్రామాల విజిట్ గురించి ఎస్ఐ శీలం లక్ష్మణ్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలో సమస్యాత్మక గ్రామలు ఏమైన ఉన్నాయా అని ఆరా తీశారు. పంచాయతీ ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో పలు అంశాలపై సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు.

క్రిప్టో కరెన్సీని ప్రజలు నమొద్దు

క్రిప్టో కరెన్సీ యాక్టివిటీస్ అన్ని ఇతర దేశాల్లో జరుగుతాయని, ప్రజలు క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెట్టి మోసపోయి కేసులు పెట్టడం ద్వారా ఉపయోగం ఉండదని సీపీ శ్రీనివాస్ తెలిపారు. మోసపోయిన వారు ఇక్కడ కేసులు పెట్టినా, ఇతర దేశాల్లో చర్యలు తీసుకోవడం కష్టం అవతుందన్నారు. అలాగే గ్రామాల్లో ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాలు, సైబర్ క్రైమ్ ద్వారా జరుగుతున్న మోసాల విషయంలో జాగత్త వహించాలన్నారు. రామగుండం అడ్మిన్ డీసీపీ సి.రాజు, పెద్దపల్లి ఏసీపీ జి.క్రిష్ణ, సీఐ ప్రవీన్‌కుమార్, ఎస్ఐ శీలం లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

- పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్



అందుగులపల్లి వద్ద ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్

పెద్దపల్లి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ రహదారి వెంట జరుగుతున్న ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని అప్పన్నపేట, అందుగులపల్లి గ్రామాల వద్ద రాజీవ్ రహదారిపై ఇటీవల ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను గుర్తించి పరిశీలించారు. ఈసందర్భంగా సీఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల ప్రధాన ప్రాంతాల వద్ద ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వాహనదారులు సైతం గ్రామాలు ఉండే ప్రాంతాల్లో అతి స్పీడ్‌గా నడుపొద్దని, జనాభ ఉన్న ప్రాంతంలో వాహనాలను జాగ్రత్తగా నడుపాలన్నారు. అలాగే అతి స్పీడ్‌గా వాహనాలు నడుపడం ద్వారా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. వాహనాల స్పీడ్‌ను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఆయన వెంట బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్.స్వామి, ఏఎంవీఐ మధు, హెచ్‌కేఆర్ సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

యువతకు క్రీడల్లో ప్రత్యేక శిక్షణనివ్వాలి

- నూతన క్రీడా విధానంపై సమీక్షలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతమైన యువతను గుర్తించి వారి చదువులకు ఆటంక కలుగకుండా క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ నూతన క్రీడా విధానం రూపకల్పన, స్పోర్ట్స్ హబ్ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన హాజరై పలు సూచనలు చేశారు. క్రీడాకారుల నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు అంతర్జాతీయ క్రీడా రంగంలో తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా సమగ్ర క్రీడా విధానాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. ప్రతిపాదిత క్రీడా విధానంలో భౌగోళిక పరిస్థితులను పరిగణలోకి తీసుకోవడంతో యువత ఆసక్తి కనబరిచే క్రీడలను ప్రోత్సహించడంపై దృష్టి పెట్టాలన్నారు. పాఠశాల స్థాయిలో క్రీడలను ప్రోత్సహించేలా క్రీడా విధానంలో నిబంధనలు పెట్టాలన్నారు. పాఠశాల స్థాయిలోనే క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు అందజేసి ప్రోత్సహించాలన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేలా వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల్లోని విధానాలను అధ్యయనం చేయియాలని అధికారులకు సూచించారు అంతర్జాతీయ స్థాయి యూనివర్సిటీలతో ఎంఓయూ చేసుకోవడం ద్వారా కోచ్‌ల సేవలను వినియోగించుకోవచ్చునన్నారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా క్రీడాశాఖ కార్యదర్శి జయేష్ రంజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ఓఎస్‌డీ జితేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త కింద పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చెత్త రవాణా సమయంలో పారిశుధ్య వాహనాల నుంచి చెత్త కింద పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్, రామగుండం కమిషనర్ అరుణశ్రీ డ్రైవర్లను ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పారిశుధ్య వాహనాల డ్రైవర్లతో సమావేశం నిర్వహించి తగు సూచనలు చేశారు. తడి, పొడి చెత్త వేరువేరుగా సేకరించడంతో పాటు చెత్త వాహనాల కంపార్ట్‌మెంట్ల నుంచి బయటకు రాకుండా కవర్లు కప్పి ఉంచాలని, సమయ పాలన పాటించడంతో పాటు 100శాతం ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలన్నారు. పారిశుధ్య వాహనాలకు చెత్త ఇవ్వకుండా బయట పడవేసే వారికి జరిమానా విధించాలన్నారు. ఈ సమావేశంలో ఈఈ రామన్, ఎస్ఐలు, నాగ భూషణం, సునీల్, హెల్త్ అసిస్టెంట్ సునీల్ పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

- సమీక్ష సమావేశంలో కలెక్టర్ కోయ శ్రీ హర్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. రాబోయే పదవ తరగతి పరీక్షలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అధిక సంఖ్యలో 10 జీపీఏ వచ్చేలా కార్యాచరణ అమలు చేయాలన్నారు. బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఎల్ఐపీ అమలు, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ తదితర అంశాలపై కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆరవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు విద్యార్థులకు అమలుచేస్తున్న ఎల్ఐపీ కార్యక్రమం పకడ్బందీగా జరగాలని, విద్యార్థులను ఉత్సాహపరుస్తూ వారికి పాఠ్యాంశాలు సరిగ్గా అర్థమయ్యే విధంగా బోధించాలని కలెక్టర్ సూచించారు. పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తే సరిపోదని, రాబోయే పరీక్షలలో ఎక్కువ మంది విద్యార్థులకు 10/10జీపీఏ వచ్చే విధంగా కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఉన్నత పాఠశాలలోనే హెడ్‌మాస్టర్ ప్రతి సబ్జెక్టు ఉపాధ్యాయులు పిల్లలను దత్తత తీసుకొని పదవ తరగతి పరీక్షలకు ప్రిపేర్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి, జిల్లా సమగ్ర శిక్ష సమన్వయకర్త పీఎం షేక్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ పోలీసు అధికారికి పురస్కార ప్రదానం

కోల్‌సిటీటౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన రిటైర్డ్ పోలీసు ఉన్నతాధికారి జీడుల రవీందర్‌ను పలువురు కళాకారులు నల్లవజ్రం పురస్కారంతో సత్కరించారు. బుధవారం స్థానిక నిరీక్షణ ఆర్ట్స్ క్రియేషన్స్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రవీందర్‌కు నల్లవజ్రం పురస్కారం అందజేసి ఘనంగా సన్మానించారు. ఇటీవల తార ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన నల్లవజ్రం పురస్కారాల కార్యక్రమంలో అనివార్య కారణాలతో జీడుల రవీందర్ అందుకోలేకపోయారని ఇండియన్ పీపుల్ థియేటర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కవ్వంపెల్లి స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మేజిక్‌రాజా, చంద్రపాల్, కన్నం లక్ష్మీనారాయణతో పాటు రవీందర్ సహ విద్యార్థులు షబ్బీర్ అహ్మద్, కనకయ్య, రాజిరెడ్డి, రాజయ్యగౌడ్, జాన్‌ఈవెన్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మూడు నెలల వ్యవధిలో అన్నాచెల్లెళ్ల ఆత్మహత్య


చందన్‌కుమార్ (ఫైల్)


మల్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల వ్యవధిలో అన్నాచెల్లెలు ఆత్మహత్య చేసుకోవడంతో వారి కుటుంబం లో విషాదం అలుముకుంది. గతనెల 19న మల్యాలకు చెందిన బైరి చందన్ కుమార్ (37) గ్రామ శివారులో గల క్రిమిసంహారక మందు తాగాడు. విషయాన్ని తన మిత్రు లకు ఫోన్ చేసి సమాచారం అందించగా వారు వెంటనే చికిత్స కోసం జగిత్యాలకు అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు. కొన్ని రోజుల తరువాత కరీంనగర్‌కు తీసుకువచ్చి చికిత్స అందిస్తుండగా మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మైగ్రేన్‌తోనే ఆత్మహత్య హత్యాయత్నానికి పాల్పడినట్లు మృతికి ముందు కరీంనగర్ ఆసుపత్రిలో న్యాయమూర్తికి వాంగ్మూలం ఇచ్చిన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. గత ఆగస్టు 13న చందన్‌కుమార్ చెల్లి ఇదే గ్రామంలో ఉంటున్న గుండేటి లావణ్య(32) ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్యయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతి చెందింది. అన్నాచెల్లెలు ఇద్దరు మూడు నెలల వ్యవధిలోనే మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

ఇసుక లారీ పట్టివేత

మెట్‌పల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో బుధవారం సీఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ నిర్వహించారు. వాహనాల తనిఖీలో కోరుట్ల నుంచి నిజామాబాదు వైపు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. లారీని సీజ్ చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా తరిలిస్తున్న వాహనం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

పూర్తి పరిహారం అందేనా?

- అనంతగిరి నిర్వాసితుల ఎదురుచూపులు
- ప్రాజెక్టుకు పోచమ్మ పేరైనా పెట్టలేదు
- అధికారులు మాటతప్పారని ఆగ్రహం
- పునరావాస కాలనీలోనూ సమస్యలే అధికం

ప్రాజెక్టు నిర్మాణానికి ముందు అనంతగిరి గ్రామం


అనంతగిరి గ్రామ సమీపంలో నిర్మించిన అన్నపూర్ణ రిజర్వాయర్


ఇల్లంతకుంట, అక్టోబరు 6: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలో 3.5 టీఎంసీల సామర్థ్యంతో గత ప్రభుత్వం రిజర్వాయర్ నిర్మించింది. ప్రాజెక్టు పూర్తయినా నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారం అందలేదు. గ్రామంలో 1600 ఎకరాల పట్టాభూమి, 837 కుటుంబాలతోపాటు 297 మందిని నిర్వాసితులుగా గుర్తించింది. 2013 చట్ట ప్రకారం పరిహారం చెల్లిస్తామని పేర్కొనగా కొంతమంది కోర్టును ఆశ్రయించారు. 2013 చట్ట ప్రకారం పరిహారంగా రూ.12లక్షల54 వేలతోపాటు ఇంటిస్థలాన్ని ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. కోర్టును ఆశ్రయించిన వారికి రూ.5లక్షలతోపాటు ఇంటి స్థలాన్ని కోర్టులో డిపాజిట్ చేశారు. 23 మే 2017ను కటాఫ్‌గా నిర్ణయించిన ప్రభుత్వం 2019లో పరిహారం చెల్లించి 2020లో గ్రామాన్ని ఖాళీ చేయించింది. నిర్వాసితులకు ముంపునకు గురైన గ్రామ సమీపంలోనూ, తంగళ్లపల్లి మండలం పద్మనగర్ పరిధిలోకి వచ్చే ప్రాంతంలోనూ ఇళ్ల స్థలాలను ఇచ్చారు.

కటాఫ్ తేదీ డిమాండ్

తమకు పరిహారం 2019న ఇచ్చినందున దానినే కటాఫ్ తేదీగా పరిగణలోకి తీసుకోవాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు. రెండేళ్లలో 120 మంది 18 ఏళ్లు నిండిన వారు, 67 మంది వివాహమైన వారు ఉన్నారు. ఇంటి కొలతల విషయంలో అన్యాయం జరిగిందని అధికారుల దృష్టికి తేగా మరోసారి సర్వే నిర్వహించారు. వారికి కూడా ఇంత వరకు న్యాయం జరగలేదు.

ప్రాజెక్టుకు పోచమ్మ పేరు పెట్టలేదు

అనంతగిరి గ్రామస్థుల ఆరాధ్య దైవమైన ముత్యాల పోచమ్మ పేరును ప్రాజెక్టుకు పెట్టాలని ముందు నుంచి గ్రామస్థులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాన్ని ఖాళీ చేసే వరకు సరేనన్న అధికారులు తర్వాత తమ పరిధిలో లేదని చేతులెత్తేశారు. ప్రాజెక్టుకు అన్నపూర్ణ రిజర్వాయర్‌గా నామకరణం చేశారు.

పునరావాస కాలనీల్లో సమస్యల తిష్ట

అనంతగిరి నిర్వాసితులకు గ్రామ సమీపంలో కేటాయించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సమస్యలు తిష్టవేశాయి. ఆరోగ్య ఉపకేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు జరగలేదు. పాఠశాలకు ప్రహరీ లేదు. సరైన మురుగునీటి కాలువలు లేవు. డివైడర్ పూర్తి కాలేదు. తంగళ్లపల్లి సమీపంలోని కాలనీలో సౌకర్యాలు లేక ఇంటిస్థలాలు పొందినవారు నిర్మాణాలు చేపట్టడం లేదు.

కలగా పర్యాటక గుర్తింపు

మూడు గుట్టల మధ్య నిర్మించిన అన్నపూర్ణ ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా మారుస్తామన్న హామీ కలగానే మిగిలిపోయింది. అప్పటి సీఎం కేసీఆర్ సిరిసిల్లలో జరిగిన బహిరంగ సభలో హామీ ఇచ్చారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌లో చేపలు పట్టుకునే హక్కుతో పాటు ఫిష్‌మార్కెట్ ఏర్పాటు చేస్తామన్న హామీకూడా నెరవేర లేదు.




అనంతగిరి గ్రామస్థులు నివసిస్తున్న పునరావాస కాలనీ, గ్రామ పంచాయతీ కార్యాలయం

18 సంవత్సరాల ప్యాకేజీ అందలేదు


అల్లెపు నవీన్‌కుమార్, నిర్వాసితుడు అనంతగిరి

ప్రభుత్వం కటాఫ్ తేదీని నిర్ణయించినప్పుడే పరిహారం ఇవ్వ లేదు. పరిహారం ఇచ్చే నాటికి నాకు 18 సంవత్సరాలు దాటాయి. ఇంతవరకు పరిహారం ఇవ్వలేదు. విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలి.

ఫ్యామిలీ ప్యాకేజీ రాలేదు


గోకులకొండ రాజు, నిర్వాసితుడు అనంతగిరి

కటాఫ్ తేదీ తర్వాత వివాహమైంది. దీంతో ఫ్యామిలీ ప్యాకేజీ రాలేదు. నాలుగేళ్లవుతున్నా నిర్వాసితుల సమస్యలు తీరలేదు. రేషన్‌కార్డులు లేకపోవడంతో ఆరోగ్యశ్రీ వర్తించడం లేదు. పునరావాస కాలనీలో సమస్యలు ఉన్నాయి.

క్రైం కార్నర్

యువకుడి ఆత్మహత్య

శంకరపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామంలో కారులోన్ తీర్చలేక మనస్తాపంతో దాసారపు శ్యామ్ (27) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దాసారపు శ్యామ్ మూడేళ్ల క్రితం రుణంలో కారు తీసుకొని హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో నడిపిస్తున్నాడు. కారు ఈఎంఐలు కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని పలుమార్లు తల్లిదండ్రులకు చెప్పుకొని బాధపడేవాడు. దీపావళి పండుగకి హైదరాబాద్ నుంచి మెట్‌పల్లికి వచ్చి తల్లిదండ్రులతో పాటే ఉంటున్నాడు. మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు పనికి వెళ్లాక శ్యామ్ ఒక్కడే ఇంటి వద్ద ఉన్నాడు. సాయంత్రం 4గంటల సమయంలో శ్యామ్‌కు అతని తమ్ముడు కళ్యాణ్ ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో పక్కింటి వారికి ఫోన్ చేశారు. దీంతో వారు ఇంట్లోకి వెళ్లి చూడగా శ్యామ్ వంటగదిలోని ఇనుప పైపుకు చీరతో ఉరేసుకొని కనిపించాడు. హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కారులోన్ తీర్చలేక మనస్తాపానికి గురై శ్యామ్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి దాసారపు ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జరిమానా

శంకరపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ముగ్గురు వ్యక్తులకు బుధవారం హుజూరాబాద్ కోర్టు జరిమానా విధించింది. శంకరపట్నం మండలం కేశవపట్నం పోలీసులు తనిఖీలు నిర్వహించి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురు వ్యక్తులను బుధవారం హుజూరాబాద్ కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ కోర్టు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఈశ్వరయ్య ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు కేశవపట్నం ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వెల్గటూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీపతి మహేష్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలం కొండపూర్ గ్రామానికి చెందిన శ్రీపతి మహేష్ ద్విచక్ర వాహనంపై వెల్గటూర్ మండలం ముత్తునూర్ గ్రామానికి వెళ్తున్నాడు. ఇదే క్రమంలో కొత్తపల్లి వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ క్రమంలో మహేష్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని 108 వాహనంలో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

స్వగ్రామం చేరిన వలసజీవి మృతదేహం

రాయికల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్‌వెళ్లి అనారోగ్యంతో మృతి చెందిన వలసజీవి మృతదేహం బుధవారం స్వగ్రామం చేరుకుంది. మండలంలోని ఒడ్డెలింగాపూర్ గ్రామానికి చెందిన పాల కుర్తి అశోక్ గత నెల 25న గుండెపోటుతో మస్కట్ (ఓమన్)లో మృతి చెందాడు. మృతదేహం రావడానికి మస్కట్‌లోని పలువురు అక్కడి అధికారులతో మాట్లాడి ఆర్థిక సహాయం అందించి మృతదేహానికి రవాణా ఖర్చులు భరించి పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నుంచి ఒడ్డెలింగాపూర్‌కు ఉచితంగా అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేసింది. మృతదేహం స్వగ్రామం చేరడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు అపహరణ

మెట్‌పల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 12వ వార్డులో మహిళ మెడలోనుంచి నిందితులు పుస్తెలతాడును అపహరించారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని 12వ వార్డుకు చెందిన కందనవేణి వాణి తన కుమారుడికి ఇంటి సమీపంలో ఆడిపించుకుంటు అన్నం తినిపిస్తోంది. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు నిందితులు మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును అపహరించుకుపోయారు. వాణి అరవడంతో చుట్టు పక్కలవారు రాగా గమనించిన నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడు అపహరణకు గురైనట్టు సదరు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

సైదాపూర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండల కేంద్రంలోని వెన్నేపల్లి గ్రామానికి చెందిన వేముల మధునయ్య(68) అనే వ్యక్తి బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మధునయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. బుధవారం జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరులేని సమయంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మధునయ్య కూతురు పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీ..

- ఇద్దరికి గాయాలు

పెద్దపల్లి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి మండలంలోని గొల్లపల్లి బస్టాప్ వద్ద కారు, బైక్ ఢీకొని ఇద్దరికి స్వల్పగాయాలు అయ్యాయి. పెద్దపల్లి నుంచి గోదావరిఖని వైపు కారులో జిల్లా బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి వెళ్తుండగా అప్పన్నపేట గ్రామానికి చెందిన యువకుడు ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతున్న క్రమంలో బైక్‌కు కారు ఢీకొట్టింది. దీంతో కారు రోడ్డు కిందకి దించడంతో కారులో ఉన్న జిల్లా అధికారికి గాయాలు కాగా, ద్విచక్ర వాహనదారుడు గాయాల పాలయ్యాడు.

లారీ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

సిరిసిల్ల క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ చౌరస్తా వద్ద బుధవారం నడుచుకుంటూ వెళ్తున్న మహిళకు లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన పత్రి బాలవ్వ (42)కు తీవ్రగాయాలయ్యాయి. బాలవ్వ సిరిసిల్లలో తోపుడు బండిపై వీధుల్లో తిరుగుతూ పాత సామగ్రి కొనుగోలు చేస్తుంది. తిరిగి కాలినడకన ఇంటికి వెళ్తోంది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు బాలవ్వను లారీ ఢీకొంది. ఆమె కిందపడి తలకు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్సకోసం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు .

గ్రామపంచాయతీ ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

శంకరపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని కన్నాపూర్ గ్రామపంచాయతీ ముందు ఉన్న గ్రామపంచాయతీ ట్రాక్టర్ బ్యాటరీని మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన చోటు చేసుకుంది. బుధవారం ఉదయం గ్రామపంచాయతీ సిబ్బంది ట్రాక్టర్ వద్దకు వచ్చి చూడగా ట్రాక్టర్ బ్యాటరీని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి రాజేష్‌కు తెలుపగా రాజేష్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

జాతీయ రహదారిపై కారును ఢీ కొట్టిన లారీ

శంకరపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామ శివారులోని జాతీయ రహదారిపై బుధవారం కారును లారీ ఢీ కొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రమాదం తప్పింది.

ఆర్చరీ క్రీడాకారుడిని అభినందించిన కలెక్టర్


క్రీడాకారున్ని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి కల్చరల్/ఎలిగేడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఆర్చ రీ పోటీలకు ఎంపికైన ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తాని పర్తి యశ్వంత్‌ను కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అభినందించారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో ఈనెల4న జరిగిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొన్న యశ్వంత్ అండర్17 బాయ్స్ కాంపౌండ్ విభాగం లో కాంస్య పతకాన్ని సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. గుజరాత్ రాష్ట్రంలో ఈనెల 11,12 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి క్రీడలకు జిల్లా విద్యార్థి ఎంపిక కావడంపై కలెక్టర్ విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులకు అభినందన


జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులకు అభినందిస్తున్న కలెక్టర్

పెద్దపల్లికల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర స్థాయిలో జరిగిన కళా ఉత్సవాలలో గట్టేపల్లి విద్యార్థులు నాటికల విభాగంలో పాల్గొని ప్లాస్టిక్ తో ప్రమాదం అనే నాటికను ప్రదర్శించి జాతీయ స్థాయికి ఎంపికైనారు.ఈసందర్భంగా విజేతలైన విద్యార్థులను బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. కళా రంగంలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా విద్యాధికారి డి.మాధవి, అకడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ పీ.ఎం. షేక్, కళా ఉత్సవాలు జిల్లా ఇన్చార్జి జి. జగదీశ్వర్, పాఠశాల హెచ్ ఎం. అన్నపూర్ణ , అభినందించారు. ఈ సందర్భంగా గైడ్ టీచర్ రాజమల్లును అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. డిసెంబర్ నెల చివరిలో మధ్యప్రదేశ్ లోని భోపాల్ లో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరి విజయం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి


సాయికృష్ణ(ఫైల్)


తాండ్ర శ్రీహాస్(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కరీంనగర్-జగిత్యాల రోడ్డులో ట్రినిటి కళాశాల దగ్గర మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. కొత్తపల్లిలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన చిలుముల సాయికృష్ణ (23), వీణవంక మండలం చల్లూరుకు చెందిన తాండ్ర శ్రీహాస్(20) మృతిచెందగా జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం తాండ్రియాల గ్రామానికి చెందిన మామిడిపల్లి నాగరాజు(21)కు తీవ్ర గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ ఎలాంటి ఇండికేటర్లు వేయకుండా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయటంతో ఇద్దరి ప్రాణాలు గాలిలో కలిశాయని మృతుల కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆరోపించారు. మృతుల కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వీరు ముగ్గురు స్నేహితులు కాగా కొంత కాలంగా కరీంనగర్‌లోని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల సమీపంలో ఒక గదిని అద్దెకు తీసుకుని ఓ రెస్టారెంట్‌లో ఉద్యోగం చేస్తున్నారు. మంగళవారం రాత్రి 11 గంటలకు రెస్టారెంట్‌లో విధులు ముగించుకుని ఒక హోటల్‌కు వెళ్లి భోజనం పార్సిల్ తీసుకుని బైక్‌పై గదికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. బైక్ ముందు వెళ్తున్న లారీని డ్రైవర్ అకస్మాత్తుగా పక్కకు తిప్పాడు. దీంతో బైక్ అదుపుతప్పి లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురు లారీ వెనుకభాగంలో చిక్కుకున్నారు. అలాగే 100 మీటర్ల దూరం వరకు వారిని లారీ ఈడ్చుకెళ్లింది. తీవ్ర గాయాలైన సాయికృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీహాస్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. నాగరాజు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. చేతికందివచ్చిన కొడుకులు మరణం వార్తతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. నిర్లక్ష్యంగా, లారీని నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని సాయికృష్ణ తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రెండో టాణా పోలీసులు తెలిపారు. మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే చర్యలు

- మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లిరూరల్, నవంబర్, 6 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి డివిజన్ పరిధిలో ఎవరైనా అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినా, తరలించిన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని వేంపేట గ్రామం నుంచి అక్రమంగా ఆటోలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా బుధవారం సీఐ నిరంజన్‌రెడ్డి పట్టుకున్నారు. సిబ్బందితో కలిసి వేంపేట శివారులో వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానస్పదంగా నిజామాబాద్ జిల్లాకు వెళ్తున్న టీఎస్ 07యూఎఫ్6840 నంబర్ గల ట్రాలీ ఆటో ను ఆపి తనిఖీ చేశారు. వాహనంలో సుమారు 20 కింటాళ్ల బియ్యాన్ని సంచుల్లో తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనంతో పాటు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన పద్మ రంజిత్ కుమార్ అనే ఆటో డ్రైవర్ ఎలాంటి అనుమతులు లేకుండా బియ్యాన్ని నిజామాబాద్‌కు తరలించి అక్కడి నుంచి మహారాష్ట్రలో విక్రయించడానికి తరలిస్తున్నట్టు ఒప్పుకున్నాడు. దీంతో రేషన్ బియ్యంతో పాటు వాహనం, నిధింతుడుని అదుపులోకి తీసుకుని మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఎస్సై చిరంజీవి కేసు నమోదు చేసుకుని స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయి అధికారులకు అప్పగించారు.

విరిగిన స్తంభం.. తప్పిన పెను ప్రమాదం


లారీ తగలడంతో తెగిపడ్డ విద్యుత్ తీగలు

వీర్నపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో ప్రధాన రహదారిపై ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలకు ధాన్యం తరలిస్తున్న లారీ తగలడంతో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభం విరిగి ఇంటిపై పడింది. దీంతో ఆ కుటుంబంలోని ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రమాదం జరిగినప్పుడు విద్యుత్ స్తంభం దగ్గర ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్తంభం విరిగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లారీ డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో ప్రమాదం జరిగిందని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ధాన్యం లారీని అక్కడి నుంచి తరలించారు. విద్యుత్ తీగలను సరిచేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రమేష్ తెలిపారు.

విద్యార్థుల మరణాలు ప్రభుత్వ హత్యలే..

- బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్

సిరిసిల్లటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సాంఘిక సంక్షేమ హస్టల్స్, గురుకులాల్లో విద్యార్థుల మరణాలు కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలేనని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్ అన్నారు. బుధవారం సిరిసిల్ల లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల కాలంలో సంక్షేమ హస్టల్స్ గురుకులాల పాఠశాలలో అనేక సంఘటనలతో విద్యార్థులు మరణించారని ఆరోపించారు. కొందరు విద్యార్థులు పాము కాటుకు గురికాగా, మరికొందరు ఫుడ్‌పాయిజన్‌తో మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. సాంఘీక సంక్షేమ హస్టల్స్‌కు, గురుకులాలకు విద్యార్థులను పంపించడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారని అన్నారు. కొమరం భీం జిల్లా వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో దాదాపు 60 మంది విద్యార్థులు ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థతకు గురికాగా అందులో ముగ్గురు విద్యార్థుల పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారని అందులో ఒక్క విద్యార్థి వెంటిలేటర్‌పై ఉన్నారని అన్నారు. విద్యాశాఖ, గిరిజన శాఖ మంత్రిగా కొనసాగుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బాధిత విద్యార్థులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరామర్శించక పోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థపై, విద్యార్థుల సంక్షేమంపై దృష్టి పెట్టకుంటే బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్వీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు షేక్ సికిందర్, నాయకులు ఎస్‌కే బాబా, మెట్టెల సాయిదీప్, వల్లబోజు రమణాచారి, కణుకుంట్ల వెంకటరమణ, గాజుల మనిదీప్, గుజ్జె తరుణ్, రాచమల్లు మోహన్, హష్వక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారులో బైక్ అదుపుతప్పి తల్లి, కొడుకు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు సూత్రాల సంపత్ అతని తల్లి లక్ష్మీతో కలిసి బోర్నపల్లిలోని సోదరి ఇంట్లో శుభకార్యానికి హాజరై బైక్‌పై తిరిగి వస్తుండగా కొత్తగట్టు శివారులో గుంతలో పడి బైకు అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. సంపత్, అతని తల్లి లక్ష్మీకి తీవ్ర గాయాలు కాగా పోలీసులు క్షతగాత్రులను హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌లో పతకాలు సాధించాలి

డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్



ఉమ్మడి జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌లో మంచి ప్రతిభ కనబరిచి ఎక్కువ పతకాలు సాధించాలని కరీంనగర్ జిల్లా యువజన క్రీడాశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. నగరంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో పాఠశాలల క్రీడా సమాఖ్య జిల్లాస్థాయి అండర్-14, 17 బాలుర రెజ్లింగ్ పోటీలను బుధవారం డీవైఎస్‌వో ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే కరీంగర్ జిల్లాకు క్రీడలపరంగా మంచి పేరుందని, దీనిని కొనసాగించేందుకు క్రీడాకారులు శ్రమించాలన్నారు. క్రీడాకారులు నిత్య సాధనతో మెరుగైన ఫలితాలు సాధించగలరన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 8 నుంచి హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనే కరీంనగర్ జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుకుమార్, ఫిజికల్ డైరెక్టర్లు ఎ శంకరయ్య, వి పూర్ణసాయి అఖిల్, సైనిక్ పాఠశాల రెజ్లింగ్ కోచ్ ఎం వంశీకృష్ణ, పీఈటీ సఫియా, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎస్‌యూ ఖో-ఖో పోటీల విజేత ఎస్సారార్ జట్టు



శాతవాహన యూనివర్సిటీ అంతర్ కళాశాలల ఖో-ఖో పోటీల విజేత ఎస్సారార్ కళాశాల జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ నిర్వహించిన అంతర కళాశాల ఖో-ఖో పోటీల విజేతగా ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల జట్టు నిలిచింది. అలగప్ప యూనివర్సిటీలో నిర్వహించనున్న అంతర యూనివర్సిటీ పోటీలకు కళాశాలకు చెందిన జె గణేశ్, ఎం కిశోర్, కె శ్రీరాం, సీహెచ్ అఖిల్, పి వెంకటేశ్, బి గణపతి, జి తిరుమలేష్, ఎం రాహుల్, ఎల్ వర్ధన్‌లు ఎంపికైనట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎస్ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల జట్టును ప్రిన్సిపాల్ డాక్టర్ కె రామకృష్ణ, అధ్యాపకులు పడాల తిరుపతి, ఎం మల్లారెడ్డిలు అభినందించారు.

ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ కోచ్‌గా అజీమ్

జగిత్యాలరూరల్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి మోడల్ స్కూల్‌లో పీడీగా పనిచేస్తున్న అజీమ్ ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ కోచ్‌గా ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జరగనున్న ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-19 బాలికల, బాలుర బాస్కెట్‌బాల్ పోటీలకు కోచ్‌గా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సరితాదేవి, వైస్‌ప్రిన్సిపాల్ నగేష్, ఉపాధ్యాయ బృందం అజీమ్‌ను అభినందించారు.

ఏ దేశమైనా ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలంటే విద్యుత్ తప్పనిసరి. దేశంలో విద్యుత్ అవసరాలను తీర్చేందుకు 1975 నవంబరు 7న నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టీపీసీ) సంస్థను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎన్టీపీసీ ఆవిర్భావంతో దేశీయ విద్యుత్ రంగంలో నూతన శకం ప్రారంభమైంది. ప్రస్తుతం దేశం మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో నాలుగో వంతుకుపైగా (76,475.68 మెగావాట్లు) ఎన్టీపీసీ ఉత్పత్తి చేస్తోంది. థర్మల్, గ్యాస్, జల విద్యుత్, సోలార్ విద్యుత్ ఉత్పత్తితోపాటు బొగ్గు గనుల నిర్వహణ, గ్యాస్ నిక్షేపాల అన్వేషన(ఎక్స్‌ప్లోరేషన్), కన్సల్టెన్సీతో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇతర సంస్థలకు అందజేయడం, ఇలా అంచెలంచెలుగా ఎదిగిన ఎన్టీపీసీ గురువారంతో 49 ఏళ్లు పూర్తి చేసుకొని 50వ వసంతంలోకి అడుగు పెడుతూ స్వర్ణోత్సవాలకు సిద్ధమైంది.

ఎన్టీపీసీ @50

- స్వర్ణోత్సవాలకు ఏర్పాట్లు
- నేడు ఆవిర్భావ దినోత్సవం

జ్యోతినగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : దేశీయ విద్యుత్ అవసరాలను తీర్చడంతోపాటు ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధిలో ఎన్టీపీసీ కీలకపాత్ర పోషిస్తున్నది. దేశంలో ఉత్పత్తి అయ్యే మొత్తంలో నాలుగో వంతు ఎన్టీపీసీ నుంచి లభిస్తున్నది. విద్యుత్ ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న ఎన్టీపీసీ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తన వ్యాపారాన్ని విస్తరిస్తోంది. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్‌గా ఉన్న ఎన్‌టిపిసి 14 ఏళ్ల క్రితం ఎన్టీపీసీ లిమిటెడ్‌గా అవతరించింది. 36 బొగ్గు ఆధారిత(థర్మల్), 7 గ్యాస్ (నాఫ్తా), 15 సోలార్ ప్రాజెక్టులు, 2 జల విద్యుత్ ప్రాజెక్టులు, ఒక విండ్, 9 జాయింట్ వెంచర్(సంయుక్త రంగం)లో మొత్తం 97 ప్లాంట్లను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 76,475.68 మెగావాట్ల స్థాపిత సామర్థ్యంగల సంస్థ 2032 నాటికి 1.28 లక్షల మెగావాట్ల సామర్థ్యానికి విస్తరించడానికి ప్రణాళికలను రూపొందించింది. ఎన్టీపీసీ గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు 420 బిలియన్ యూనిట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి జరిపింది.

● నిరంతర అభివృద్ధి..

ఎన్టీపీసీ అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో పయనిస్తోంది. గత దశాబ్ద కాలంలో రికార్డుస్థాయిలో స్థాపిత సామర్థ్యాన్ని విస్తరించింది. మొత్తం దేశం స్థాపిత సామర్థ్యంలో 16 శాతం ఎన్టీపీసీకి ఉండగా ప్రస్తుత సంస్థ ఇన్‌స్టాల్డ్ కెపాసిటీ 76,475 మెగావాట్లకు చేరింది. దేశవ్యాప్తంగా సుమారు 2 లక్షల కోట్ల రూపాయల నిధులతో కొత్త విద్యుత్ కేంద్రాల నిర్మాణాలు(ఎన్టీపీసీ, జాయింట్ వెంచర్) వివిధ దశల్లో ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంతో పాటు ఈ ఆర్థిక సంవత్సరం ఎన్టీపీసీ గణనీయమైన లాభాలను ఆర్జించింది. గత 49 ఏళ్లలో ఎన్టీపీసీకి ఉత్పత్తి, సేఫ్టీ, సీఎస్‌ఆర్, మానవ వనరులు, పర్యావరణ పరిరక్షణ, పరిపాలన, నాణ్యత, బెస్ట్‌ప్లేస్ టు వర్క్ తదితర అన్ని అంశాల్లో పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయి.

● బొగ్గు గనుల నిర్వహణ..


ఎన్‌టీపీసీ లిమిటెడ్ స్వయంగా బొగ్గు గనుల నిర్వహణకు పూను కున్నది. గత దశాబ్దకాలంగా దేశం లోనే అత్యధిక మొత్తంలో బొగ్గును వినియోగిస్తున్న ఎన్టీపీసీ గత ఆర్థిక సంవత్సరం రికార్డు స్థాయిలో 250 మిలియన్ టన్నుల బొగ్గును విని యోగించినట్లు అధికారిక లెక్కలు తెలుపుతున్నాయి. ఇంధన కొరతను ఎదుర్కొనడానికి దేశవ్యాప్తంగా 10 బొగ్గు బ్లాకులు(107 బిలియన్ మెట్రిక్ టన్నులు) ఎన్టీపీసీకి ఉన్నాయి. సాంప్రదాయేతర పద్ధతుల ద్వారా చిన్న విద్యుత్ కేంద్రాలను నెలకొల్పేందుకు ప్రణాళికలు సంస్థ రూపొందించింది. సాంప్రాదాయేతర ఇంధన వనరుల ద్వారా 50,000 మెగావాట్ల అదనపు విద్యుత్ ఉత్పత్తి చేయాలని ఎన్టీపీసీ భావిస్తున్నది. దీనిలో ప్రధానంగా సోలార్, పవన, జియోథర్మల్ విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించింది.



రామగుండంలోని ఎన్టీపీసీ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు

● స్వర్ణోత్సవాలకు రెడీ..

ఈ ఏడాదితో 50వ వసంతంలోకి అడుగుపెట్టిన ఎన్టీపీసీ స్వర్ణోత్సవాలను నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ ఏడాదిపాటు దేశ వ్యాప్తంగా ఎన్టీపీసీ ప్రాజెక్టుల ప్రాంతాల్లో, కార్పొరేట్ సెంటర్(ఢిల్లీ)లో స్వర్ణోత్సవాలను జరుపుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సాంస్కృతిక, క్రీడోత్సవాలను నిర్వహించనున్నది. అలాగే 50 ఏళ్ల సందర్భంగా ఉద్యోగులకు ప్రత్యేక కానుకను ప్రకటించే అవకాశముంది.



గుజరాత్ రాష్ట్రంలోని అంతా విద్యుత్ కేంద్రం (గ్యాస్)

● గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యం..

థర్మల్(బొగ్గు ఆధారిత) విద్యుత్ కేంద్రాల నిర్వహణ కోసం నెలకొల్పిన ఎన్టీపీసీ మారుతున్న కాలానికి అనుగుణంగా పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా గ్రీన్ ఎనర్జీ రంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. కాలుష్య నివారణలో భాగంగా దేశ వ్యాప్తంగా సోలార్, పవన, జియో థర్మల్, జల విద్యుత్‌ను విస్తరిస్తోంది. ఇప్పటికే పదుల సంఖ్యలో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులను నెలకొల్పి ముందుకు సాగుతున్నది.



రామగుండంలోని ఎన్టీపీసీ

గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణపై గ్రామ సభ

చిగురుమామిడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో బుధవారం గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్ భూసేకరణ నోటిఫికేషన్‌పై గ్రామ సభ నిర్వహించారు. కరీంనగర్ ఆర్డీవో కె.మహేశ్వర్ మాట్లాడుతూ గౌరవెల్లి కెనాల్ భూసేకరణలో భాగంగా గ్రామంలో భూమిని కెనాల్ పనులకు వినియోగించుకోవడం జరుగుతుందన్నారు. భూములు కోల్పోతున్న రైతుల వివరాలను అధికారులు గ్రామ సభలో చదివి వినిపించారు. భూములు కోల్పోతున్న రైతులకు ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ రాములు, డీఈ ప్రశాంత్ ఏఈ నెహ్రూ, ఆర్‌ఐ అరుణ్‌కుమార్, రైతులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

స్వర్ణకార ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి

రాష్ట్ర స్వర్ణకార సంఘం ఉపాధ్యక్షుడు ముత్తోజు శ్రీనివాస్

సుభాష్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్వర్ణకార ఫెడరేషన్ ఏర్పాటు చేసి స్వర్ణకార వృత్తిని కాపాడాలని తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం ఉపాధ్యక్షుడు ముత్తోజు శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నగరంలోని ప్రెస్‌భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్లో కార్పొరేట్ జువెల్లరీ సంస్థల వల్ల స్వర్ణకార వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న వారు పనులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చేతిలో పనిలేక, ఉండేందుకు ఇల్లు లేక, పిల్లలను చదివించుకోలేక, ఇంటి అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదిలో సుమారు 200 మంది వరకు స్వర్ణకారులు బలవన్మరణాలకు పాల్పడ్డారని తెలిపారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తమ వృత్తి కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి ఆంధ్రప్రదేశ్ మాదిరిగా తెలంగాణలో కూడా స్వర్ణకార ఫెడరేషన్ ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కడార్ల శివప్రసాద్, ప్రధానకార్యదర్శి కట్ట జగన్, కోశాధికారి కడార్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు రావుల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి కందుకూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కడార్ల చంద్రశేఖర్, వెగ్గలం రామకృష్ణ, రాష్ట్ర నాయకులు కట్ట రాజబ్రహ్మం, ముత్తోజు మహేశ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సామూహిక కార్తీక దీపోత్సవం



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

వేములవాడ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కార్తీకదీపోత్సవం కొనసాగుతుంది. బుధవారం ఆలయ ఓపెన్ స్లాబ్‌లో మహిళలు పెద్ద సంఖ్యలో సామూహిక కార్తీక దీపాలను వెలిగించారు. ఓం, లింగాకారం, స్వస్తిక్ ఆకృతుల్లో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కోరం గ్రామానికి చెందిన వెంకటేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం చేపట్టారు. అంతకుముందు ఆలయ ఏఈవో జయకుమారి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ధర్మపురి, (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో ఐదో రోజు బుధవారం గోదావరి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకుని స్థానిక లక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుంచి వేదపండితులు, అర్చకులు, గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపారు. ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ నదీ మాతను వేడుకున్నారు. రాత్రి వరకు నదీ మాతకు హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేద పండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమ ణాచారి, నరసింహమూర్తి, ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్ కుమార్, రాజగోపాల్, అర్చకులు అరుణ్‌కుమార్, అశ్విన్, వంశీకృష్ణ, విజయ్, నవీన్, మోహన్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



ధర్మపురిలో గోదావరి వద్ద హారతి

రాష్ట్రస్థాయి ఆర్బీఐ క్విజ్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గణేశ్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ అటానమస్ కళాశాలకు చెందిన బీబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులు జే విశ్వతేజ, జే సిద్ధార్థలు ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆన్‌లైన్‌లో నిర్వహించిన ప్రోగ్రాంలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి ఆర్బీఐ క్విజ్ పోటీలకు ఎంపికయ్యారు. వీరు నవంబరు 18వ తేదీన హైదరాబాదులో నిర్వహించే ఆర్బీఐ క్విజ్ పోటీలలో ప్రత్యక్షంగా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ క్విజ్ పోటీలు విద్యార్థులలోని ప్రతిభను వెలికి తీయడానికి ఉపయోగపడతాయన్నారు. రాష్ట్ర స్థాయిలో సైతం అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కరీంనగర్ లీడ్ బ్యాంకు మేనేజర్ టీవీఎస్‌ఆర్ ఆంజనేయులు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నితిన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కొడిమ్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 68వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా అండర్ 14 వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. టోర్నమెంట్‌లో బాలికల విభాగంలో రాజన్నసిరిసిల్ల జిల్లా ప్రథమ బహుమతిని, బాలుర విభాగంలో ప్రథమ బహుమతిని జగిత్యాల జట్లు కైవసం చేసుకున్నాయి. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లావణ్య, ఎంఈవో శ్రీనివాస్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ లక్ష్మీనాయక్, ప్రెజిడెంట్ విశ్వప్రసాద్, మండల సెక్రెటరీ రాజమల్లయ్య, పీడీలు అనూప్‌రెడ్డి, వీరుపాల్‌రెడ్డి, దేవయ్య, హరీష్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, మహేష్, అజీం, ప్రభాకర్, అనిల్, రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





బాలికల విభాగంలో ప్రథమ బహుమతి పొందిన సిరిసిల్ల జట్టు, బాలుర విభాగంలో ప్రథమ బహుమతి పొందిన జగిత్యాల జట్టు

ప్రభుత్వం వైద్యులకు అండగా ఉంటుంది

మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఐఎంఏ కార్యవర్గం

సుభాష్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం వైద్యులకు అండగా ఉంటుందని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు బుధవారం కరీంనగర్‌లోని ఐఎంఏ హాల్లో కరీంనగర్ ఐఎంఏ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డాక్టర్లపై దాడులు చేస్తే ఉపేక్షించేదిలేదన్నారు. డాక్టర్లు కూడా విలువలతో కూడిన వైద్యం అందించాలని కోరారు. ఆసుపత్రుల ఏర్పాటు కోసం సింగిల్‌విండో విధానం ఏర్పాటు చేయాలని వైద్యులు కోరిన అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జిల్లాలో 16 మండలాలు ఉన్నాయని ప్రతినెల ఓ మండలం చొప్పున ఆధ్వర్యంలో ఐఎంఏ ఆధ్వర్యం లో వైద్య శిబిరం నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ గురుకులాలు మోడల్ స్కూలు, ఇతర పాఠశాలల్లో కూడా అవగాహన కార్యక్రమాలు వైద్య సేవలు అందించాలని కోరారు ఇటీవల కాలంలో చాలా మంది గుండెపోటుకు గురవుతున్నారన్నారు. అందుకు పలు రకాలు కారణాలు ఉన్నప్పటికీ అందులో అత్యధిక మోతాదులో మందులు రాయడం కూడా ఒక కారణం అనే ప్రచారం జరుగుతోందన్నారు. దీనిపై వైద్యులు దృష్టి సారించాలన్నారు. మానకొండూరు ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ డాక్టర్లపై దాడులు జరగడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్, కార్యదర్శి డాక్టర్ నవీన్ కుమార్, కోశాధికారి డాక్టర్ విజయ్ కుమార్, మాజీ అధ్యక్షుడు డాక్టర్ రామ్‌కిరణ్, మాజీ కార్యదర్శి డాక్టర్ వెంకటరెడ్డి, మాజీ కార్యదర్శి డాక్టర్ మల్లికార్జున్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఖాళి ప్రసాద్ రావు, మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు, డాక్టర్ ఎడవెల్లి విజయేందర్ రెడ్డి, ఎలెక్ట్ అధ్యక్షుడు డాక్టర్ పి కిషన్, డాక్టర్ కవిత డాక్టర్ ఎమ్మెల్యేన్ రెడ్డి పాల్గొన్నారు.

పీజీ కళాశాలను సందర్శించిన వైస్‌ఛాన్స్‌లర్

కోల్‌సిటీటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలను బుధవారం శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ యు.ఉమేష్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో ఉన్నటువంటి సదుపాయాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని, తరగతులకు హాజరుకావాలని సూచించారు. అదే విధంగా విద్యార్థులకు అవసరమైనటువంటి కంప్యూటర్ ల్యాబ్, ఇతర సౌకర్యాలను త్వరలోనే సమకూరుస్తానని విద్యార్థులకు సూచించారు. కళాశాలకు సంబంధించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమాకాంత్, డాక్టర్ సురేష్ కుమార్, డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ రవి, డాక్టర్ ప్రసాద్, అజయ్‌కుమార్, సావిత్రి, యాదయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం డిపోలో నిలిచిన సరఫరా

- రెండు రోజులుగా సాంకేతిక లోపం అంటున్న అధికారులు
- ధరల పెంపుపై జోరుగా ప్రచారం

కరీంనగర్ క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా మద్యం డిపోల నుంచి రిటైల్ షాపులకు మద్యం సరాఫరా మంగళవారం నుంచి రెండు రోజులుగా నిలిచిపోయింది. మద్యం వ్యాపారులు ఆన్‌లైన్ ద్వారా మంగళవారం, బుధవారం మద్యం కొనుగోలుకు చలాన్ చెల్లించినప్పటికీ ఇన్‌వాయిస్ రావటం లేదు. మద్యం డిపో సైట్ ఓపెన్ కావటం లేదు. మద్యం ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేసిన ప్రభుత్వం 'సీటెల్' సైట్ ద్వారా అమ్మకాలు సాగిస్తున్నది.

జిల్లాల్లోని మద్యం డిపోలకు కేటాయించిన కోడ్ ఆధారంగా ఆయా డిపోల పరిధిలోని మద్యం దుకాణా లైసెన్స్‌దారులు చలాన్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయగానే మద్యం స్టాక్‌ను చూపిస్తుంది. వ్యాపారులు తమకు అవసర మున్న మద్యం సెలెక్ట్ చేసకున్న తరువాత ఇన్‌వాయిస్ వస్తుంది. ఇన్‌వాయిస్ ఆధారంగా మద్యం డిపో నుంచి స్టాక్‌ను మద్యం షాపులకు పంపిస్తుంటారు. అయితే రెండు రోజులుగా సీటెల్ సైట్ ఓపెన్ కానందున దుకాణాలలో మద్యం సరుకు అయిపోవస్తుందని ఆందోళన చెందుతున్నారు. సైట్‌లో సాంకేతిక లోపం తలెత్తిన కారణంగానే సైట్ ఓపెన్ కావటం లేదని మద్యం డిపో అధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. రెండు రోజుల్లో మద్యం ధరలు ప్రభుత్వం పెంచనుందని ఈ కారణంగానే ప్రభుత్వమే సైట్‌ను నిలిపివేసిందనే ప్రచారం మద్యం వ్యాపారుల్లో చర్చ జరుగుతోంది.

కరీంనగర్ మద్యం డిపో ద్వారా కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన 192 వైన్‌షాపులు, 56 బార్‌లకు మద్యం సరఫరా అవుతున్నది. కరీంనగర్ మద్యం డిపోలో రోజుకు 3 కోట్ల వ్యాపారం సాగుతుంది. ఈ లెక్కన 6 కోట్ల వ్యాపారం నిలిచిపోయింది. అయితే ధరలు పెరుగుతున్నాయనే ప్రచారం నేపథ్యంలో పాత ధరలకు కొనుగోలు చేయాలనే ఉద్దేశంలో పెద్ద ఎత్తున మద్యం కొనుగోలుకు వ్యాపారులు చలాన్‌లు చెల్లించి సిద్ధమయ్యారు. తీరా మద్యం కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తుండగా రెండు రోజుల నుంచి సైట్ తెరుచుకోలేక పోవటంతో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విస్కీ ఫుల్ బాటిల్‌పై 70 రూపాయలు, బీరుపై రూ.20 వరకు ధరలు పెరిగే అవకాశముందని సమాచారం.

న్యూస్ బాక్స్

షీటీమ్ అవగాహన సదస్సు

కోల్‌సిటీటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని మహాత్మా జ్యోతి బాపూలే బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో బుధవారం షీటీమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీమ్ సభ్యులు స్నేహలత మాట్లాడుతూ ఎవరైనా వేధింపులకు గురిచేస్తే 6303923700 నంబర్‌కు ఫోన్‌చేయాలని కోరారు. ఆన్‌లైన్ మోసాలకు గురి అయితే 1930కి సమాచారం ఇవ్వాలని, మహిళలకు ప్రమాదం ఉన్నట్లయితే గుర్తైతే 100 నంబర్‌కు డయల్ చేయాలన్నారు.ప్రిన్సిపాల్ శిరీష, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీసీ కోసం డబ్బులు డిమాండ్

జూలపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుమ్మరికుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శోభారాణి ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ ఇవ్వడం కోసం డబ్బులు డిమాండ్ చేసిందని అదే గ్రామానికి చెందిన సాయిని చెంద్రశేఖర్‌రావు అనేవ్యక్తి ఆరోపించాడు. పాఠశాలలో చదివిన తన కూతురు అనన్య పైచదువులు కోసం టీసీ, స్టడీ సర్టిఫికెట్లు కావాలని హెచ్‌ఎం శోభారాణిని కోరగా, సర్టిఫికెట్లు ఇచ్చి వాటిపై రౌండుసీల్ వేయకుండా రెండువేలు ఇవ్వాలని డిమాండ్ చేసిందని ఆరోపించాడు. ఈవిషయమై ఇన్‌చార్జి ఎంఈవో సరస్వతిని వివరణ కోరగా హెచ్‌ఎం ఫోన్ కలవడంలేదని, సీఆర్‌పీ తిరుమల ద్వారా అక్కడి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోగా డబ్బులు అడగడం అనేది అవాస్తవమన్నారని ఎంఈవో తెలిపారు. గురువారం పాఠశాలను సందర్శించి పూర్తి వివరాలు తెలుసుకుంటానని తెలిపారు.

ఉచిత కంటి ఆపరేషన్లకు తరలింపు

మంథని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 34 మందిని లయన్స్ క్లబ్ విజన్‌కేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు, నేత్రవైద్య సహాయకుడు పూదరి దత్తాగౌడ్ ఆధ్వర్యంలో చల్మెడ ఆసుపత్రికి బుధవారం తరలించారు. వీరికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు, రవాణా, భోజన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.డాక్టర్ అనురాగ్ పవార్, శంషీర్, బుద్దార్తి సతీష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

సదర్ పండుగ నిర్వహణకు ప్రభుత్వం ఖర్చులు ఇవ్వాలి

మంథని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం యాదవుల సదర్ పండగను అధికారికంగా నిర్వహించాలని ప్రకటించడం సంతోషకరమైనప్పటికి వారి నిర్వాహణకు ఖర్చులు సైతం ఇవ్వాలని యాదవ సంఘం నేతలు కనవేన శ్రీనివాస్‌యాదవ్, పెగడ శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ. యాదవులకు ప్రభుత్వం ప్రత్యేక నిదులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి యాదవులకు ప్రభుత్వం ఇచ్చే గొర్రెల పంపిణీ సైతం రద్దు చేశారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం గొర్రెలు పంపిణీ చేసి యాదవ కుటుంబాను ఆర్థికంగా నిలబెట్టారన్నారు. యాదవుల సమస్యలు పరిష్కరించారని, గొర్ల మందలు మేపేందుకు ప్రభుత్వ భూములు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు మేముల లక్ష్మయ్య, కనవేన కొమురయ్యలు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన రామగిరి ఏఎస్సై స్వామి

రామగిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామగిరి పోలీస్ స్టేషన్ ఏఎస్సైగా ఈదునూరి స్వామి బుధవారం విధుల్లో చేరారు. హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్సైగా పదోన్నతి పొంది రామగిరి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సందర్భంగా నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

గతంలో కమాన్‌పూర్‌లో కానిస్టేబుల్‌గా, గోదావరిఖని టూటౌన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా, పెద్దపల్లిలో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసిన స్వామి ఇటీవల పదోన్నతి పొందారు.

నాణ్యమైన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలి

అదనపు కలెక్టర్ డి.వేణు

ఎలిగేడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని త్వరగా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఎలిగేడు మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ జిల్లాలో రైతులు పండించిన వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ కట్టుదిట్టంగా నిర్వహించాలని, ప్రతిరోజు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల వివరాలు, వారు తీసుకువచ్చిన వడ్ల వివిరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. వడ్ల తేమశాతం ఎప్పటికప్పుడు రికార్డ్‌చేయాలని, ప్రమాణాల ప్రకారం 17తేమశాతం రాగానే ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. మద్దతు ధరపై నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలన్నారు. ఎటువంటి ఆలస్యం జరగడానికి వీలులేదని, కొనుగోలు కేంద్రాల వద్ద అకాల వర్షాల దృష్ట్యా పంటనష్టపోకుండా అవసరమైన టార్పాలిన్ కవర్లు సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. కొనుగోలు చేసిన వడ్ల వివరాలను వెంటనే ఓపీఎంఎస్‌లో నమోదు చేస్తూ రైతులకు త్వరగా ధాన్యం డబ్బులు చెల్లింపులు జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా పౌరసఫరాల శాఖ అధికారి పీఏసీఎస్ ఛైర్మన్ గోపు విజయభాస్కర్ రెడ్డి, ఏవో ఉమాపతి, ఐకేపీ ఏపీఎం సుధాకర్, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.


గర్రెపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

● సుల్తానాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తున్న నాణ్యమైన ధాన్యాన్ని త్వరగా మద్దతు ధరపై కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ డి వేణు అధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ డి వేణు సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి, భూపతిపూర్ గ్రామాల్లో సింగిల్‌విండో ద్వారా ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ కేంద్రాలలో ఆయన ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పర్యవేక్షిస్తూ రికార్డులను పరిశీలించారు. సీఈవో నబీయోద్దీన్ నుంచి కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి, సీఈవో నబీయోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ కృషితోనే టీఎస్‌టీపీపీ స్టేజ్ 2 నిర్మాణం

విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేతలు

జ్యోతినగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ కృషి వల్లనే ఎన్టీపీసీకి చెందిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు స్టేజ్ 2 అడ్డంకులు తొలగి నిర్మాణానికి సిద్ధమైందని కాంగ్రెస్ పార్టీ జ్యోతినగర్ పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఆసీఫ్‌పాషా, డివిజన్ల అధ్యక్షులు భరత్‌గౌడ్, ఈదునూరి రవి, సదానందం, వెంగలబాపు, కిషన్‌రెడ్డి తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టిఎస్‌టిపిపి రెడో దశకు సంబంధించి నీటి కేటాయింపులతో పాటు సాంకేతిక అంశాలలో రేవంత్ సర్కారు ఎన్టీపీసీకి చేయూతనందించిందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు విషయంలో మంత్రి డి.శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. రాబోయే తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టులో స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీపీసీపై ఒత్తిడి తేవాలని కోరారు. మంత్రి, ఎమ్మెల్యే వల్లనే రామగుండం శరవేగంగా అభివృద్ధి బాటలో పయనిస్తోందని, కోట్లాది రూపాయలు మంజూరు చేయించి నియోజకవర్గం, కార్పొరేషన్‌లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినల్లు చెప్పారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు 1020 రూపాయల అలవెన్సు బకాయిలు ఇప్పించడంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఎన్టీపీసీ సీఎండీతో మాట్లాడారని, అందువల్లనే కార్మికులకు న్యాయం జరిగిందని గుర్తు చేశారు. రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) ఏర్పాటువల్ల ఎన్టీపీసీతోపాటు ఇతర సంస్థలలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు బి కేటగిరి కింద వేతనాలు భారీగా పెరుగుతాయన్నారు. అలాగే ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు 6 నెలల గేట్ పాస్, 60ఏళ్ల దాటిన కార్మికుల తొలగింపు లేకుండా చేసేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

రైతులను ఆదుకోవడానికే సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు

- క్వింటాలుకు మద్దతు ధర రూ.7521 చెల్లింపు - పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు


నిమ్మనపల్లిలో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని చిన్నకలువల శ్రీ వెంకటేశ్వర కాటన్ మిల్లులో సీసీఐ వారి పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో దాదాపు మూడు లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో పంట దెబ్బతిని దిగుబడులు తగ్గిపోయాయన్నారు. ఈ నేపథ్యంలో సీఎం స్పందించి సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారని ఇందులో భాగంగా బుధవారం సుల్తానాబాద్ మండలంలోని చిన్నకలువలలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించామన్నారు. రైతులు తగిన తేమ శాతం నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రవీణ్ రెడ్డి, పెద్దపల్లి, సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్లు మినుపాల ప్రకాష్‌రావు, స్వరూప సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

● పెద్దపల్లి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సీసీ కొనుగోలు కేంద్రాల ద్వారా నాణ్యమైన పత్తికి క్వింటాల్‌కు రూ.7521 మద్దతు ధర చెల్లిస్తున్నట్లు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. బుధవారం పెద్దపల్లి మండలంలోని నిమ్మనపల్లి మహలక్ష్మీ జిన్నింగ్ మిల్లులో బుధవారం సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీసీఐ నిబంధనల మేరకు నాణ్యమైన పత్తికి మద్దతు లభిస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రతిపక్షాలు చేస్తున్న అనవసర రాద్ధాంతాన్ని రైతులు నమ్మవద్దని, రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మార్కెట్ ఛైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, సింగిల్‌విండో ఛైర్మన్‌లు మాదిరెడ్డి నరసింహారెడ్డి, ఆళ్ల సుమన్‌రెడ్డి, మార్కెట్ వైస్‌ఛైర్మన్ మల్లారెడ్డి, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పృథ్వీరాజ్‌లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

9 నుంచి సమగ్ర సర్వే..

(5వ పేజీ తరువాయి)

చేయాల్సి ఉంటుంది. సర్వే నిర్వహించేందుకు సిబ్బంది వెళ్లినప్పుడు ఇంటి యజమానులు అందుబాటులో ఉండాలని పేర్కొంటున్నారు. కానీ ఎప్పుడు, ఏ సమయానికి ఎన్యూమరేటర్ వస్తారనే విషయం తెలియకుండా పోతున్నది. ఈ సర్వే పైన ప్రజల్లో పెద్దగా ఆసక్తి కనబర్చడం లేదు. తప్పరిసరిగా సర్వేలో పాల్గొనాలని, తమ కుటుంబ వివరాలన్నింటినీ ఖచ్చితంగా ఇవ్వాలని ప్రభుత్వం ఎక్కడా పేర్కొనకపోవడం, సర్వేలో వివరాలు ఇవ్వకుంటే సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందవు అనే హెచ్చరికలు లేకపోవడంతో సర్వే గురించి ప్రజల్లో పెద్దగా చర్చ జరగడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం సర్వే గురించి విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది.

సర్వేకు ప్రజలు సహకరించాలి : కలెక్టర్


పెగడపల్లిలో సర్వే వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం మండలంలోని పెగడపల్లి, గంగారం,కాల్వశ్రీరాంపూర్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను, ప్రభుత్వ పాఠశాలలను, పెద్దరాత్‌పల్లిలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వల్ల మరిన్ని సంక్షేమ పథకాలు అమలు, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన కోసం ఈ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. పెగడపల్లిలో కుటుంబ సర్వే తీరును పరిశీలించారు. రైతులు తెచ్చే వరిధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేసుకొని తేమశాతం పరిశీలించాలని నిర్వాహకులకు సూచించారు. వరిధాన్యం కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించాలని అకాల వర్షం పడితే ధన్యాం తడవకుండా టార్పాలిన్ కవర్లు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలను సందర్శించి విద్యార్థులను విద్యా విధానంపై అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయని విద్యార్థులను అడిగారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని, జంక్ ఫుడ్ అలవాట్లు తగ్గించి పౌష్టికాహారం తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీవో శ్రీమాల, తహసీల్దార్ ఎండీ వకీల్, ఎంపీడీవో రామ్మోహనచారి, ఎంపీవో గోవర్ధన్, తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిమ్మనపల్లి, నిట్టూరు గ్రామాల్లో పెద్దపల్లి వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్ ఈర్ల స్వరూప, సింగిల్ విండో ఛైర్మన్ మాదిరెడ్డి నరసింహారెడ్డి, వైస్ ఛైర్మన్ అంజనేయరావు, సీఈవో మదు, సింగిల్ విండో డైరెక్టర్‌లు, రైతులు పాల్గొన్నారు.

● ధర్మారం (ఆంధ్రజ్యోతి) : నంది మేడారం సహకార సంఘం ఆధ్వర్యంలో పెరుకపల్లి, బంజేరుపల్లి, కొత్తపల్లి, చామనపల్లి, బొమ్మరెడ్డిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ ఛైర్మన్ రూప్లానాయక్, ప్యాక్స్ ఛైర్మన్ బలరాంరెడ్డిలు ప్రారంభించారు. వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, కొత్త నర్సింహులు, సోగాల తిరుపతి, మాజీ సర్పంచ్ గంగా రెడ్డి తదితరులు ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

సుల్తానాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుకులో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు అన్నారు. సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ఇటీవల నియమితులైన ప్రకాష్‌రావు బుధవారం మార్కెట్ ఆఫీసులో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే విజయరమణారావు సహకారంతో నియోజకవర్గంలో ఎక్కడా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వడ్ల కటింగ్ జరగడం లేదని అన్నారు. అలాగే తాము కూడా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు తమ ధాన్యాన్ని


బాధ్యతలు స్వీకరిస్తున్న మినుపాల ప్రకాష్‌రావు

తేమ శాతం వచ్చేలా చూసుకోవాలని తద్వారా ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు తక్కువ దరకు దాన్యాన్ని అమ్మి మోసపోవద్దన్నారు. నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మినుపాల ప్రకాష్ రావును పలువురు కాంగ్రెస్ నాయకులు, అధికారులు డైరక్టర్లు ఘనంగా సన్మానించారు.

రాష్ట్ర స్థాయి హాండ్ బాల్ పోటీల్లో గాయత్రి విద్యార్థినికి కాంస్య పతకం

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌కు చెందిన విద్యార్థిని ఆకుల అక్షిత పాల్గొని కాంస్య పతకం సాధించినట్లు గాయత్రీ విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తక్కువ సమయంలోనే ఎక్కువగా సాధన చేసి అత్యుత్తమ ఆటతీరు కనబరిచి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించడం గర్వకారణమన్నారు. విద్యార్థినిని, పీఈటీ స్రవంతిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రజనీశ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్ పాల్గొని అభినందించారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

ధర్మారం, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్, హ్యాండ్ బాల్ పోటీలకు ధర్మరం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న బి.వైష్ణవి, టి.హేమలత, బి.ఐలేశ్వరి ఈనెల 8నుంచి 10 వరకు జరిగే సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక కాగ, ఏ.వైశాలి హ్యాండ్ పోటీలకు ఎంపికయ్యింది. కాగా, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో సాఫ్ట్ బాల్‌కు ఎంపికయిన విద్యార్థులు పాల్గొంటుండగా, రంగారెడ్డి జిల్లాలో జరిగే హ్యాండ్ బాల్ అండర్ 19 (ఎస్‌జీఎఫ్)పోటీలకు కరీంనగర్ అండర్ జిల్లా తరఫున ఏ. వైశాలి పోటీల్లో పాల్గొనన్నుది. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు బైకని కొమురయ్య, మేకల సంజీవ్‌తో పాటు ఇతర ఉపాధ్యాయలు ప్రత్యేకంగా అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్



విజిలెన్స్ ఆవశ్యకతపై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న కిషోర్ బగాద్దేయో

గోదావరిఖని, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ వారోత్సవాలు-2024 పురస్కరించుకుని బుధవారం ఆర్జీ-1 జీఎం ఆఫీస్‌లో రామగుండం రీజియన్, భూపాలపల్లి ఏరియాకు చెందిన వివిధ విభాగాల అధికారులకు అవగాహన కార్యక్రమం జరిగింది. గెస్ట్ లెక్చర్ కిషోర్ బగాద్దేయో కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రోస్పెరిటీ అంశాన్ని వివరించారు. సమగ్రత సంస్కృతి- దేశ పురోభివృద్ధి అనే నినాదం ఈ సంవత్సరం విజిలెన్స్ వారోత్సవాల ఉద్దేశమని తెలిపారు. ఎన్నో సహజ వనరులు, పరిమిత మానవ వనరులు ఉండి కూడా మనదేశం పూర్తిస్థాయి అభివృద్ధి సాధించకపోవడానికి ప్రధాన కారణం అవినీతి అని పేర్కొన్నారు. అవినీతిని నిర్మూలించడానికి ప్రభుత్వాలు చట్టాలు చేయడం, నిబంధనలు అమలు చేయడం మాత్రమే సరిపోదని, దేశప్రజల భాగస్వామ్యంతోనే అవినీతిని అరికట్టవచ్చని కిషోర్ బగాద్దేయో తెలిపారు. సామాజిక బాధ్యతగా అవినీతి, లంచగొండితనానికి వ్యతిరేకంగా కర్తవ్యాన్ని నిర్వర్తించాలన్నారు. సింగరేణి ప్రతిష్ట ఇనుమడింపజేసేలా సంస్థలో అవినీతికి ఆస్కారం లేకుండా అన్ని విభాగాలు, అధికారులు, ఉద్యోగులు పనిచేయాల్సిన అవసరం ఉన్నట్టు కిషోర్ బగాద్దేయో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు కిరణ్‌బాబు, అంజనేయులు, మోహన్‌రావు, క్రాంతి, దాసరి శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, డానియల్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, సారంగపాణి పాల్గొన్నారు.

ఆర్జీ-3 డివిజన్‌లో పర్యటించిన డీపీవో

రామగిరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీలో పెద్దపల్లి డీపీవో వీరబుచ్చయ్య పర్యటించారు. కార్మిక కుటుంబాలకు తాగునీటి కష్టాలు తీర్చే విధంగా చొరవ చూపాలని మాజీ ఎంపీటీసీ చిందం మహేష్ చేసిన అభ్యర్థన మేరకు బుధవారం డీపీవో వీరబుచ్చయ్య సెంటినరీకాలనీలో పర్యటించి ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలించారు. కార్మికుల కుటుంబాలకు తలెత్తుతున్న నీటి ఇబ్బందులను సింగరేణి అధికారులను అడిగితెలుసుకున్నారు. కార్మికుల కుటుంబాలకు తాగు నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గతంలో వేసిన బోర్లలలో మోటార్లు బిగించి ఫిల్టర్ బెడ్‌కు అనుసంధానం చేసి నీటి సరఫరాకు ఎలాంటి అవాంతరాలు లేకుండా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సివిల్ డీజీఎం రాజేంద్రకుమార్, డీవైఎస్‌సీ రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ చిందం మహేష్, మాజీ జడ్‌పీటీసీ గంట వెంకటరమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తాగునీటిని పరిశీలిస్తున్న డీపీవో

గుండె వ్యాధులపై అవగాహన

గోదావరిఖని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-1 పరిధిలోని 2ఇంక్లయిన్ గనిలో బుధవారం సింగరేణి వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గుండె వ్యాధులపై అవగాహ న కార్యక్రమం జరిగింది. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పద్మ గుండె సంబంధిత వ్యాధులు, వాటికి గల కారణాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కార్మికులకు వివరించారు. మధుమేహం, బీపీ లక్షణాలు దుష్ప్రభావాలు, నివారణ చర్యలను తెలియజే శారు. బీపీ, మధుమేహం ఉన్న వారు క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. వ్యాయామం, పౌష్టికాహారం తీసుకోవడం వంటివాటిని ఉద్యోగులు పాటిస్తే అనారోగ్య సమస్యలు రావని డాక్టర్ పద్మ అన్నారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ అల్లాఉద్దీన్, అధికారులు శంకర్, వెంకటేశ్వర్లు, తిరుపతి, గణేష్, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ వెంకన్న పాల్గొన్నారు.

ఓసీపీ-1 పీవోగా రాజశేఖర్

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓసీపీ-1 ప్రాజెక్టు అధికారిగా జింగిటి రాజశేఖర్ బుధవా రం బాధ్యతలు చేపట్టారు. ఫేస్-2 భద్రకాళి ఆలయంలో పూజలు చేసిన అనంతరం ప్రాజెక్టు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ప్రాజెక్టులోని వివిధ విభాగాల హెచ్‌వోడీలతో సమావేశమయ్యారు. మ్యాప్ ద్వారా ప్రాజెక్టు పరిశీలించి, బ్లాస్టింగ్ స్థితిగతులను తెలుసు కుని పలు సూచనలు చేశారు. బొగ్గు ఉత్పత్తి, యంత్రాల వినియోగం, బ్లాస్టింగ్ మెటీరియల్, బొగ్గు రవాణాపై అంశాల వారిగా చర్చించారు. అధికారులు ఉదయ్‌భాస్కర్, కిషన్, యానాదిశెట్టి, ఏఐటీయూసీ ఐఎన్‌టీయూసీ తిరుపతిరావు, గడ్డం తిరుపతి, జక్కుల దామోదర్‌రావు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

జైపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బొలేరో వాహనంలో అక్రమంగా రవాణా చేస్తున్న 20 క్వింటాల్ల పీడీఎస్ బియ్యాన్ని బుధవారం మండలంలోని ఇందారం బ్రిడ్జి వద్ద పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామం నుంచి బొలేరో వాహనంలో మహారాష్ట్రకు అక్రమంగా బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఇందారం బ్రిడ్జి వద్ద పట్టుకున్నామని తెలిపారు. బియ్యాన్ని, వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. నిందితులు రాంచందర్, ఆర్. ప్రశాంత్‌లపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

కార్మికులకు అండగా ఉంటా..

పాలకుర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కన్నాల టోల్ ప్లాజాలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు అండగా ఉంటానని డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య అన్నారు. అక్కడి కార్మికులకు దీపావళి బోనస్ రూ.5వేలు ఇప్పించిన సందర్భంగా కార్మికులు బుధవారం సమ్మయ్యను సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి తలారి శంకర్, బడుగు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు ప్రారంభం

ముత్తారం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిశ్రీరాంపూర్‌లో గ్రామస్థుల సౌకర్యార్థం చిగురు విద్యాసాగర్‌రావు నిర్మించిన వాటర్ ట్యాంకు, పశువుల నీటి తొట్టిని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ప్రారంభించారు. తండ్రి స్మారకంగా విద్యాసాగర్‌రావు వాటర్ ట్యాంకు నిర్మించడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్ రెడ్డి, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు నూనే కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దార్శనికులు దాశరథి, జాషువా..

కోల్‌సిటీటౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): దేశ దార్శనికులు కవులు దాశరథి, గుర్రం జాషువా అని ఎమ్మెల్సీ, గాయకుడు, కవి దేశపతి శ్రీనివాస్, హైదరాబాద్ సిటీ కళాశాల తెలుగు డీన్ కోటేశ్వర్‌రావు అన్నారు. మహాకవి దాశరథి శతజయంతి ఉత్సవాలలో భాగంగా చేతన సాహితీ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి గోదావరిఖని మార్కండేయ కాలనీలో జరిగిన సాహిత్య సభకు వారు ముఖ్యవక్తలుగా హాజరయ్యారు. దాశరథి సాహిత్యంపై దేశపతి శ్రీనివాస్, గుర్రం జాషువ కవిత్వంపై కోటేశ్వర్‌రావు ప్రసంగించారు. అనంతరం దేశ్‌పతి శ్రీనివాస్, కోటేశ్వర్‌రావులను చేతన సాహితీ సమాఖ్య సత్కరించింది. ఈ కార్యక్రమంలో చేతన సాహితీ సాంస్కృతిక సమాఖ్య బాధ్యులు ఎం.విజయానంద్, మాదాసు రామమూర్తి, కె.స్వామి, కార్పొరేటర్ శివకుమార్ పాల్గొన్నారు.